క్లుప్తంగా

సోయా పంటలు పరిశీలన

తాంసి: మండలంలోని వడ్డాడి శివారులో సోయా పంటలను ఏవో రవీందర్ పరిశీలించారు. యాసంగి సీజన్‌లో రైతులు ఓ కంపెనీ చెందిన సోయా విత్తనాలను చేలలో సాగుచేశారు. ప్రస్తుతం పంట ఎదగకపోవడం, కాత సరిగ్గా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన విత్తన కంపెనీ ప్రతినిధులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించిన విషయం తెలిసిందే. కాగా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏవో రవీందర్ శుక్రవారం సోయా పంటలు పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఏఈవో యోగిరాజ్, రైతులు శ్రీనివాస్, ప్రకాశ్, లక్ష్మణ్, భూమయ్య, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ఇంటిపన్ను చెల్లించి డిస్కౌంట్ పొందాలి

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు తమ ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించి ఐదు శాతం డిస్కౌంట్ పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ సూచించారు. పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో ఎర్లీ బర్డ్ స్కీం కింద పన్నుల చెల్లింపు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. పన్నులు చెల్లించిన పలువురు వ్యాపారులకు స్వయంగా రశీదులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి సంబంధించి పట్టణ ప్రజలు ముందస్తుగా పన్నులు చెల్లించేలా ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎలాంటి పాత బకాయిలు లేనటువంటి వారు ఈనెల 30వ తేదీ వరకు పన్నులు చెల్లిస్తే ఐదు శాతం డిస్కౌంట్‌ను పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్‌ఓ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

జొన్నల కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్లకు బ్రేక్ పడింది. వాతావరణం సహకరించకపోవడంతో 27న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి గంగన్న ఓ ప్రకటనలో తెలిపారు. కొనుగోళ్ల పునఃప్రారంభం తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఇచ్చోడ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేస్తున్నామని సీఐ తెలిపారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఎస్సై నవీన్ శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమవెంట వాహనపత్రాలు తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుళ్లు ఉన్నారు.

రేపు ఆదివాసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఆదివాసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉయిక విష్ణు, పూసం సచిన్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన విధానాలు–ఆదివాసీలపై ప్రభావం అనే అంశం పై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, పటేళ్లు, రాయిసెంటర్ సర్మేడీలు, యువజన సంఘాలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఇచ్చోడ: కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేణిగుంట సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కార్మిక సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికసంఘాలు కలిసికట్టుగా తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహులు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గంగయ్య, కార్మిక సంఘం నాయకులు రాజకుమార్, గోపి, శివకుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

తలమడుగు: గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీంద్ర అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది, బీఎల్‌వోలు చేపడుతున్న పోలింగ్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

- పశువుల ఎరువుపై మొగ్గు చూపుతున్న రైతులు
- పంట పొలాల్లో గొర్రెల మందల ఏర్పాటు
- భూసారంతో పాటు పెరుగుతున్న దిగుబడి



పంట పొలంలో ఏర్పాటు చేసిన మంద

ఆసిఫాబాద్‌రూరల్: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు వినూత్న పద్ధతులు అవలంభిస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని గ్రహించిన రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. రైతులు తమ పంట పొలాల్లో పశువుల మందలు ఏర్పాటు చేసుకోవడం, పశువుల ఎరువులు చల్లడం, నల్లమట్టి పోయడం వంటివి చేస్తున్నారు.

ప్రయోజనాలు అధికం..

రసాయన ఎరువుల వినియోగం వల్ల మట్టిలోని భూసారం దెబ్బతినడంతో పాటు పంట దిగుబడి కూడా తగ్గిపోతోంది. పంటల్లో తెగుళ్ల ఉధృతి పెరిగి రైతుల పెట్టుబడులు పెరుగుతున్నాయి. దీంతో అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. పొలాల్లో ఎక్కువగా సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. మండలంలో రైతులు తమ పంట పొలాల్లో భూసారం పెంచేందుకు నల్లమట్టి, ఆవులు, గొర్రెల పేడ, సేంద్రియ ఎరువులు వినియోగిస్తున్నారు.

నల్లమట్టితో మేలు..

మండలంలో సుమారు 12వేల మంది రైతులు 54వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ఎక్కువగా 36వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. పొలాల్లో నల్లమట్టి వేయడం వల్ల పంట పొలాలకు ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో మండలంలోని తెలివాడ, బాబాపూర్, ఈదులవాడ, బెల్గాం, బూర్గుడ, మోతుగూడ, రాజుర, అప్పపల్లి, ఇటిక్యాల, చిర్రకుంట గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు నల్లమట్టి తరలిస్తున్నారు. తమ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోని నల్లమట్టిని తరలించి పంట పొలాల్లో చల్లుకుంటున్నారు. నల్లమట్టి కోసం దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.800 నుంచి రూ.1500 వరకు వెచ్చిస్తున్నారు.

పంట పొలాల్లో మందలు..

మండలంలోని పర్సనంబాల, చిర్రకుంట, ఈదులవాడ, మోవాడ్, బెల్గాం, మోవాడ్‌కోసారతో పాటు మండలంలో ఎక్కువ గిరిజన గ్రామాలు ఉండటం, చాలా గ్రామాలకు పక్కనే అటవీప్రాంతం ఉండటంతో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పశుపోషణ ఎక్కువగా ఉంది. దీంతో చాలా మంది రైతులు సేంద్రియ ఎరువులను పంట పొలాల్లో వినియోగిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి ఎక్కువ వస్తుండటంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. గొర్రెలు, మేకల ఎరువుల కోసం రైతులు చేలల్లో మందలు పెడుతున్నారు. వీటి ఎరువు ధర లారీకి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతుంది. ఆవు, గేదెలకు సంబంధించిన ఎరువులకు రూ.15వేల నుంచి రూ.16వేల ధర ఉంది.

మార్కెట్‌లో లభ్యం

శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన సేంద్రియ ఎరువులు కార్బన్, గోల్డు తదితర పేర్లతో మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిపై అవగాహన ఉన్న రైతులు వీటితో కలిగే ప్రయోజనాలు తెలుసుకొని బ్రాండ్ కంపెనీలకు చెందిన సేంద్రియ ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఈ ఎరువులను వాడడం వల్ల సారవంతం తగ్గిన భూములు సారవంతం అవడంతో పాటు సారవంతమైన భూములను అధిక సారవంతం చేస్తాయని పేర్కొంటున్నాయి.

మట్టికి మేలు..



సేంద్రియ ఎరువులు, నల్లమట్టిని వినియోగించడం వల్ల పంట భూములు సారవంతమవుతాయి. దీంతో పంటలో దిగుబడి ఎక్కువగా వస్తుంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడంతో పాటు సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించితే మట్టికి మేలు జరుగుతుంది.

\- శంకర్, రైతు, మోతుగూడ

భూసారం పెరుగుతుంది



సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుంది. పోషకాలు పెరుగుతాయి. సూక్ష్మజీవులకు సేంద్రియ పదార్థం ఆహారంగా ఉపయోగపడుతుంది. భూమి సారవంతంతో పంట దిగుబడి అధికమవుతుంది. అన్ని పంటలకు సేంద్రియ ఎరువులను విరివిగా వినియోగించవచ్చు.

\- ఖాదర్ హుస్సేన్, ఏవో

ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా బూత్‌స్థాయి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం జైనూర్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్‌స్థాయి సమావేశం, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కొండంత అని, అమలు గోరంత అని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవీరాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మినగర్‌లో శ్రీవీరాంజనేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీవీరాంజనేయ దేవాలయాన్ని 1980లో నిర్మించగా, ఆ దేవాలయం రోడ్డు వెడల్పులో భాగంగా పూర్తిగా రోడ్డు కిందికి కావడంతో గ్రామస్తులు దేవాలయాన్ని పునర్నిర్మాణం చేపట్టాలని సంకల్పించి విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. శ్రీవీరాంజనేయ స్వామి సహిత శివపంచాయతన విగ్రహ యంత్ర, శిఖర, ప్రతిష్టాపన చేపట్టారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సయ్యద్ చోటామియా కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆర్థిక సహాయం చేశారు. ఎమ్మెల్యే హైదరాబాద్‌లో ఉండటంతో కార్యకర్తల ద్వారా సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు జాడి దీపక్, రావుల నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో ఇల్లు దగ్ధం



కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన మందాడి రాజన్న ఇంటిలో గ్యాస్ లీకేజీ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. మందాడి రాజన్నతో పాటు భార్య జ్యోతి, తల్లి లక్ష్మిలు వ్యవసాయ పనులకు వెళ్లగా, ఇంట్లో ఉన్న గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరిగింది. ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించి ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.2లక్షల నగదు ప్రమాదంలో కాలిపోయిందని బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ ఖలీల్ సందర్శించి విచారణ చేపట్టారు.

నేడు బీసీ సామాజిక సమ్మేళనం

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో బీసీ సామాజిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు రాధేశ్యాం సింగ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ ఘనాతే, బీజేపీ ఓబీసీ మోర్చా కార్యాలయ కార్యదర్శి శరత్‌సింగ్ ఠాకూర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీర్లకు డిమాండ్..!

కౌటాల: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మద్యం ప్రియులు బీర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో బీర్లకు బాగా డిమాండ్ ఏర్పడింది. వీటి అమ్మకాలు పెరగడంతో వైన్స్‌షాప్ యజమానులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి. కౌటాలలోని వైన్స్‌షాపుల్లో కాటన్ బీర్లపై రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. శుక్రవారం కౌటాలలో వివాహ శుభకార్యాలు, గృహప్రవేశ కార్యక్రమాలు అధికంగా ఉండడంతో ఇదే అదునుగా మద్యం వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. బీర్ల కొరత ఉండడంతో మద్యం ప్రియులు మద్యం షాపుల వద్ద బారులుదీరారు. కౌటాల–విజయనగరం రోడ్డుపై వైన్స్‌షాపుల ముందు భారీగా వాహనాలను నిలపడంతో స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతీ మద్యం షాపు ఎదుట ధరల పట్టిక ఉండాలి. ఏ బ్రాండు మద్యం ఎంతకు విక్రయిస్తున్నారో ధరల పట్టికలో సూచించాల్సి ఉన్నా, ఈ నిబంధన అనేక చోట్ల అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా మద్యం వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా బీర్లపై రూ.15 అదనంగా వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పల్లెల్లో ఉపాధి జాతర!

- ఊపందుకున్న ఉపాధిహామీ పనులు
- ప్రతీరోజు 4వేలకు పైగా కూలీలు హాజరు
- 300లకు పైగా పనులు గుర్తింపు



కొత్తపల్లి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు



లింగాపూర్‌లో..

లింగాపూర్: మండలంలో గత కొన్ని రోజులుగా ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. మండలంలో సాధారణంగా వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత మే నుంచి ఉపాధి పనులు ఊపందుకునేవి. కానీ ఈ ఏడాది అధికారులు ముందస్తుగా గ్రామాల్లో పనులు గుర్తించి పనులను ప్రారంభించారు. మండలంలో అధికారులు వరి, పత్తి, జొన్న పంట వేసిన సమయంలో ఒక రకమైనా ఉపాధి పనులు కల్పిస్తుండగా, వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత మరో రకమైనా పనులు కల్పిస్తున్నారు. కాగా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ఈ నాలుగు నెలలపాటు ముమ్మరంగా చేసేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్ల మరమ్మతు, కాలువల పూడికతీత, సి.సి.టి పనులు, ఎస్‌జీటీ పనులు, పంట కాలువలకు సంబంధించిన పనులు చేస్తున్నారు. అదేవిధంగా పశువుల తొట్టిల నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, తదితర పనులు కల్పిస్తున్నారు.

300లకు పైగా పనుల గుర్తింపు..

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 300లకు పైగా పనులను గుర్తించారు. సుమారు రూ. కోటి 50లక్షల పనులు చేసే లక్ష్యంగా పనులు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో రోజుకు సగటున 4వేల మంది వరకు కూలీలు పనులు చేస్తున్నారు. ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉపాధి పనులు జరిగే చోట టెంట్‌హౌస్‌లు, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. అయితే మండలంలోని అన్ని గ్రామాల్లో సౌకర్యాలు కల్పించడం లేదని ఉపాధికూలీలు ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే బాటిళ్లు తీసుకెళ్తున్నామని, టెంట్ లేక చెట్టు నీడలోనే విశ్రాంతి తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

ముమ్మరంగా పనులు



గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం. నిబంధనల ప్రకారం ప్రతీ కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పిస్తాం. కూలీలకు పనికి తగిన వేతనం అందేలా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు పనులు జరిగే ప్రదేశాలను తనిఖీ చేస్తున్నాం. తాగునీరు, టెంట్ సౌకర్యం కల్పిస్తాం.

\- చంద్రయ్య, ఏపీవో, లింగాపూర్

సూర్య ప్రతాపం



ఎండ వేడికి గొడుగుతో వెళ్తున్న వ్యక్తి

కౌటాల(సిర్పూర్): సూర్య ప్రతాపానికి జిల్లా ప్రజలు అల్లాడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువ కావడంతో వేడి గాలులకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోత.. బయటికి వెళ్తే వడగాలులు అన్నట్లుగా పరిస్థితి మారింది. ఈ నెల 22న సోమవారం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో వేడి స్వల్పంగా తగ్గింది. ఈ నెల 23న దహెగాం మండలం కుంచవెల్లిలో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత నుంచి మళ్లీ ఎండలు పెరుగుతున్నాయి. 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరువ కావడం, తీవ్రమైన వేడిగాలులు వీయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుభకార్యాలకు హాజరయ్యేందుకు వెళ్లే వారు క్యాప్‌లు, కర్చీఫ్‌లు కట్టుకుని కన్పించారు. ముఖ్యంగా జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బొండాల దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. శుక్రవారం రెబ్బెన మండలం వంకులంలో 44.7 డిగ్రీల సెల్సియస్ పగటి ఉష్ణోగ్రత నమోదు కాగా.. తిర్యాణిలో 44.6 డిగ్రీలు, ఎల్కపల్లి 44.5, కుంచవెల్లి 44.5, ధనోరా 44.1, కాగజ్‌నగర్ 44.1, జంబుగా 44.1, ఆసిఫాబాద్ 43.9, దహెగాం 43.5, కౌటాల 43.5 డిగ్రీలుగా నమోదైంది.

కుష్టుపై విస్తృత ప్రచారం కల్పించాలి



మాట్లాడుతున్న అధికారులు

పెంచికల్‌పేట్: కుష్టు వ్యాధిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర కుష్టు బృంద సభ్యుడు డిప్యూటీ పారా మెడికల్ అధికారి వెంకటేశ్వర చారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కుష్టు వ్యాధి అనుమానితులను ఆయన పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి అంటువ్యాధి అని, కుష్టు వ్యాధిని నివారించడానికి ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మందులతో కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధి ఇతరులకు సోకకుండా క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీహెచ్‌ఈవో శ్యామూల్, వైద్యులు అశ్రీన్, సతీశ్‌రెడ్డి, ఎస్ఎస్ఎన్ రెడ్డి, విక్టోరియా, విజయ్, సావిత్రి, భాగ్యలక్ష్మి, సంతోష్, మాధురిలత తదితరులు పాల్గొన్నారు.

ముల్కల్లలో ఉచిత వేసవి శిక్షణ కేంద్రం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉచిత వేసవి ఫిట్‌నెస్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల అనుభవం గల కమాండో శిక్షకుడు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో 14సంవత్సరాలు పైబడి ఈ వేసవి ఫిట్‌నెస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల వ్యాయామాలు, రన్నింగ్, వివిధ రకాల గేమ్స్‌లతో పాటు మోటివేషన్ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 1వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 5–30 గంటల నుంచి 7–30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ముల్కల్ల గ్రామ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9989237646 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899